సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వేంకటేశ్వరస్వామికి పూజలు

ధర్మారం : దొంగతుర్తిలోని శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



గనిలో దిగిన జీఎం

గోదావరిఖని: కార్పొరేట్ ఈ అండ్ ఎం జీఎం రఘురాంరెడ్డి శనివారం జీడీకే-1, 3 గనిలోకి దిగారు. 4వ సీమ్, 26 డీ పిల్లరింగ్ డిస్ట్రిక్ట్‌లో పనులు తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
32.2/26.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

జోరుగా వరికోతలు



వరి పైరు కోస్తున్న హార్వెస్టర్

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో యాసంగి వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మొన్నటివరకు ఎండలు దంచికొట్టగా.. కొద్దిరోజులుగా ఆకాశం మేఘాలతో కమ్ముకుంటోంది. దీంతో పంటలు వర్షానికి తడిసిపోయే ప్రమాదం ఉందనే భావనతో రైతులు ముందుగానే వరి కోతలు కోస్తున్నారు. దీంతో వరికోత యంత్రాలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేఅదనుగా కొందరు యజమానులు హార్వెస్టర్ అద్దెలు పెంచుతున్నారు.

పేషెంట్లకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు, వారి సహాయకులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. ఈ పథకం శనివారం నాటికి 200రోజులు పూర్తిచేసుకుంది. రోజూ దాదాపు 150 మందికి అల్పాహారం అందిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కన్వీనర్ జయపాల్‌రెడ్డి తెలిపారు. పెళ్లిరోజు, పుట్టినరోజు తదితర శుభకార్యాల సందర్భంగా ముందుకొచ్చే దాతలు రూ.2,500 చెల్లిస్తే 150మందికి అల్పాహారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. సభ్యులు రాంచంద్రారెడ్డి, సత్యనారాయణ, రాజగోపాల్, శ్రీనాద్‌కుమార్, రాంరెడ్డి, రాంకిషన్, కుమారస్వామి, శ్రీనివాస్, నరేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని ప్రొఫెసర్ నతానియేలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు స్థానికేతరులే ఎంపీలుగా గెలుపొందారని, ఈసారి స్థానికుడినైన తనకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. తాను విజయం సాధిస్తే విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు మహేందర్‌రెడ్డి, వీరస్వామి, బాపు పాల్గొన్నారు.

హక్కులు కాలరాసిన కాంగ్రెస్



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: అధికారం కోసం బీసీల ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత వారి హక్కులు కాలరాస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి మధు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల సంక్షేమానికి అనేకమంది మహనీయులు త్యాగాలు చేశారని, వారి చరిత్రను కనబడకుండా చేశారని ఆరోపించారు. బీసీలు అనేక సమస్యల్లో చిక్కుకున్నారని, వారి ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి కులగణన పేరిట ముందుకు వచ్చారని, అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తీసుకురాలేదని పుట్ట మధు విమర్శించారు.

ఇక్కడ పుట్టడం నా అదృష్టం



రాంచందర్‌ను సన్మానిస్తున్న బస్తీపెద్దలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలో పుట్టి పెరగడం తన అదృష్టమని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. నగరంలోని సంజయ్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మిక కుటుంబంలో జన్మించి, తల్లిదండ్రుల క్రమశిక్షణలో పెరిగానని గుర్తుచేసుకున్నారు. ఈప్రాంత ప్రజల సాధకబాధకాలు తనకు తెలుసని అన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నాయకులు మాతంగి రాయమల్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి శంకర్, పుల్లూరి లింగయ్య, రామిండ్ల వెంకటస్వామి, పులిపాక శంకర్, ఈర్ల ఓదెలు, అట్ల జగ్గయ్య, కేసారపు రాజపోశం, బూడిద రమేశ్, సారయ్య, మారపల్లి రవికుమార్, కాసిపేట స్వామి, మాతంగి సది పాల్గొన్నారు.

తలాపున గోదారి..

దాహం తీరే దారేది?

శ్రీపాద ఎల్లంపల్లిలో అడుగంటిన నీరు

- శ్రీపాద ఎల్లంపల్లిలో అడుగంటిన నీరు
- ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు
- సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు 'గోదావరే' ఆధారం
- ఇప్పటికే రీసైక్లింగ్ పద్ధతి అమలు చేస్తున్న ఎన్టీపీసీ
- ఆందోళన చెందుతున్న పారిశ్రామిక ప్రాంతం

కరువు కథలు



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో పడిపోయిన నీటి నిల్వలు

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి తాగునీటి ముప్పు ముంచుకొస్తోంది. సుందిళ్ల బ్యారేజీలో బ్యాక్ వాటర్ తగ్గడం, ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు వేగంగా అడుగంటిపోతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ అవసరాలతోపాటు సంస్థ అధికారులు, ఉద్యోగుల కుటుంబాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా యాజమాన్యాలు తాగునీరు సరఫరా చేస్తున్నాయి. సింగరేణి యాజమాన్యం గోదావరిఖని సమీపంలోని గోదావరినది వద్ద ఏర్పాటు చేసిన ఇంటెక్‌వెల్ నుంచి గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీలోని కార్మిక కుటుంబాలకు తాగునీరు సరఫరా చేస్తోంది. అయితే సుందిళ్ల బ్యారేజీలో బ్యాక్‌వాటర్ తగ్గిపోవడంతో ఇంటెక్ వెల్ వద్ద నీరు అడుగంటింది. ప్రస్తుతం గోదావరి నదిలోని ఇసుకలో వేసిన ఫిల్టర్ల ద్వారా నీటిని ఇంటెక్‌వెల్‌కు తీసుకుని అక్కడ నుంచి పంప్‌ల ద్వారా కార్మికవాడలకు సరఫరా చేస్తున్నారు. నల్లాల ద్వారా ఉద్యోగుల క్వార్టర్లకు తాగునీరు అందిస్తున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులో తగ్గిన నీటి నిల్వలు

- రామగుండం సమీపంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు గతేడాది ఇదే సమయంలో 10టీఎంసీలు నిల్వ ఉండగా, ప్రస్తుతం 7టీఎంసీల నిల్వ ఉంది.
- ఇక్కడ నుంచి ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, మిషన్‌భగీరథ, హెచ్‌ఎండబ్ల్యూఎస్(హైదరాబాద్ ప్రజలు)కు నీరు సరఫరా చేస్తున్నారు.

ఎన్టీపీసీకి 121క్యూసెక్కులు

- రామగుండం ఎన్టీపీసీ ప్రతీరోజు 121క్యూసెక్కుల నీటిని వినియోగిస్తోంది.
- ఇందులో విద్యుత్ ప్రాజెక్టు అవసరాలకు పోను సుమారు 2వేల క్వార్టర్లలోని ఉద్యోగుల కుటుంబాలకు శుద్ధి చేసిన నీటిని ఎన్టీపీసీ యాజమాన్యం అందిస్తోంది.
- ప్రస్తుతం క్వార్టర్లలో 16వందల కుటుంబాలు ఎన్టీపీసీ పీటీఎస్, టీటీఎస్‌లో నివాసం ఉంటున్నట్లు అంచనా.
- ప్రతీరోజు రెండుసార్లు నీరు అందిస్తున్నా.. ఇప్పటికే కొంతసమయాన్ని కుదించినట్లుగా తెలుస్తోంది.
- అయితే, నీటి కొరతను అధిగమించేందుకు ప్లాంట్‌కు వినియోగిస్తున్న నీటిని రీసైక్లింగ్ విధానంలో ఎన్టీపీసీ యాజమాన్యం పొదుపుగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.
- కాలువల ద్వారా వ్యవసాయ రంగానికి కూడా అందిస్తున్నారు.
- ప్రస్తుతం యాసంగి పంటలు చివరిదశకు వచ్చాయి.
- ఇందులో వరి పంటకు పెద్దగా ఇబ్బంది లేకున్నా.. తాగునీటి అవసరాలకు నీటి లభ్యత ఇబ్బందిగా మారే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఇంటెక్‌వెల్ వద్ద..

గోదావరి నదిలో ఇంటెక్‌వెల్ వద్ద నీటి మట్టం తగ్గిపోయింది. అయినా.. ఇసుకలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ల ద్వారా నీటిని ఇంటెక్‌వెల్ నుంచి కార్మిక వాడలకు అందిస్తున్నారు. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు తాగునీటికి ఇబ్బందేమీలేదని అధికారులు చెబుతున్నారు. నిత్యం 35ఎంఎల్‌డీ నీటిని ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో సుమారు 16,900క్వార్టర్లకు సరఫరా చేస్తున్నారు. నీటి కొరత ఏర్పడితే రోజూ నీటిని రెండురోజులకోసారైనా నల్లాల ద్వారా అందిస్తామని అంటున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరందించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు చెబుతున్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 12.6 ఎంఎల్‌డీ..

ఆర్‌ఎఫ్‌సీఎల్ రోజూ 12.6 ఎంఎల్‌డీ నీటిని వినియోగిస్తోంది. ఫ్యాక్టరీ అవసరాలకు పోను సుమారు 500క్వార్టర్లలోని ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం మంచినీటిని అందిస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని నిత్యం పంపింగ్ చేస్తున్నారు. అయితే, ప్రాజెక్టులో నీటి మట్టం పడిపోతుండటంతో అధికారులు వేగంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లోని సంస్థ క్వార్టర్లకు గోదావరి నదిలోని ఇంటెక్‌వెల్ నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్నాం. ప్రస్తుతానికి నదిలో నీటి మట్టం తగ్గినా.. యథావిధిగా నీటి సరఫరా కొనసాగిస్తున్నాం. మొత్తం మూడు పంపుల్లో రెండింటి ద్వారా నిత్యం తాగునీరు పంపింగ్ చేస్తున్నాం.

– శ్రీనివాస్, సింగరేణి ఆర్జీ-1 జీఎం

ఎల్లంపల్లి నుంచి రోజూ నీటి సరఫరా తీరు

ఎన్టీపీసీ	121క్యూసెక్కులు
ఆర్‌ఎఫ్‌సీఎల్	12.6ఎంఎల్‌డీ
సింగరేణి	35ఎంఎల్‌డీ

నివాసాల సంఖ్య సంస్థల వారీగా..

సింగరేణి	16,900
ఎన్టీపీసీ	2,000
ఆర్‌ఎఫ్‌సీఎల్	500

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్



దిశానిర్దేశం చేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి తెలంగాణ పోలీస్, తద్వారా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకు రావాలని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం పోలీస్ కమిషనరేట్‌లో ఈనెల 19న నిర్వహించే తమిళనాడు సాధారణ ఎన్నికల విధులకు వెళ్తున్న 64 మంది హోంగార్డ్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. అప్పగించిన విధులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. విలువైన ఆభరణాలు, వస్తువులు వెంట తీసుకువెళ్లవద్దన్నారు. సముద్ర తీరం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ప్రదేశం కావడంతో మంచినీరు అధికంగా తాగాలని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరిగే సూచనలు ఉంటే అధికారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అధికారులు కేటాయించిన స్థలాన్ని వదిలి వెళ్లవద్దని అన్నారు. అందరితో మర్యాదగా ప్రవర్తించాలని సీపీ సూచించారు. సమీప పోలీసు స్టేషన్, ఫైర్‌స్టేషన్‌లోని సీనియర్ ఆఫీసర్ల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఎక్కడ ఉందో తెలుసుకొని ఉండాలన్నారు. కార్యక్రమములో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- కార్తకర్తలు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



అభివాదం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

మంథని: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పదేళ్లపాటు అనేక ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. కష్టకాలంలో ఉన్నప్పుడు తన వెంట నిలిచిన కార్యకర్తలే తన కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. అందరి ఆశీర్వాదంతో పెదల పెన్నిధి 'కాకా' మనవడు గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. రోడ్లపై వీధి కుక్కలు మొరుగుతున్నాయని, వాటిని పట్టించుకోవద్దన్నారు. ప్రభుత్వం ద్వారా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు పరిశ్రములు తీసుకొస్తామని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గడ్డం వివేకానంద, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిక
- దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు
- ఆర్థికసాయం కోసం వేడుకోలు



ఆస్పత్రిలో రమేశ్

రామగిరి(మంథని): అనారోగ్యంతో బాధపడుతున్న భర్త ఒకవైపు.. ఆర్థికలేమి మరోవైపు.. ఇద్దరు పిల్లల భవిష్యత్ ఇంకోవైపు.. ఆ ఇల్లాలిని కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దాతలు ఎవరైనా ఆర్థికంగా ఆదుకుంటే ఇంటి పెద్దను బతికించుకుంటామని, తద్వారా అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని విన్నవిస్తోంది. కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నాల రమేశ్ – రాజకుమారి దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు సహర్ష, రియాన్స్. సహర్ష మూడో తరగతి చదువుతుండగా, రియాన్స్ ఒకటో తరగతి చదువుతున్నాడు. రమేశ్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య సాయంతో వారిని ఉన్నతంగా చదివించాలని కలలుగన్నాడు. అయితే, విధి వక్రీకరించింది. కొంతకాలం క్రితం అతడు అనారోగ్యం బారినపడ్డాడు. ఆస్పత్రిలో చూపించగా పాంక్రియాటిస్‌గా వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఇందుకోసం ఇప్పటిదాకా స్థోమత ఉన్నంత వరకు వైద్యం కోసం ఖర్చు చేశారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇరవై రోజుల్లోనే సుమారు రూ.15లక్షల వరకు ఖర్చయ్యింది. మెరుగైన చికిత్స కోసం ఇంకా రోజూ రూ.లక్ష వరకు వైద్యానికి వెచ్చించాల్సి వస్తోంది. ఇంటిపెద్ద ఆస్పత్రి పాలుకావడంతో రాజకుమారికి కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో వైద్యం కోసం అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చేదని ఆ ఇల్లాలు కన్నీటిపర్యంతమవుతోంది. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే తన భర్తను కాపాడుకుంటానని, పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతామని వేడుకుంటోంది.

దాతలు సంప్రదించాల్సిన గూగుల్ పే, ఫోన్‌పే :
79892 35852, 76010 87602
బ్యాంక్ అకౌంట్ వివరాలు
కన్నాల రాజకుమారి
ఖాతా నంబరు : 318101000002692
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ – ఐఓబీఏ : 0003181
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, కల్వచర్ల

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం



మంథని: శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు



సుల్తానాబాద్ : నివాళి అర్పిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



గోదావరిఖని : అన్నదానం చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, నాయకులు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు చేసిన సేవలు మరవలేనివని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని శివకిరణ్ గార్డెన్‌లో శనివారం శ్రీపాదరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా శ్రీపాదరావు ముందుకు సాగారన్నారు. ఆయన కుమారుడిగా శ్రీపాదరావు ఆశయసాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గడ్డం వివేకానంద, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీపాద ఆశయ సాధనకు కృషి

సుల్తానాబాద్(పెద్దపల్లి): శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేద్దామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. స్థానిక నెహ్రూ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీపాదరావు వర్ధంతి నిర్వహించారు. విజయరమణారావు మాట్లాడుతూ, శ్రీపాదరావు అడుగుజాడల్లో నడుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, మాజీ సర్పంచులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, సంతోష్‌రావు, జనగామ ప్రశాంత్‌రావు, కల్లేపల్లి జానీ, అమిరి శెట్టి రాజలింగం, పోచం, సాయిరి మహేందర్, పొన్నం చంద్రయ్యగౌడ్, ముస్త్యాల రవీందర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

గోదావరిఖని: ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగిన దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీపాదరావు వర్ధంతి నిర్వహించారు. అజాతశత్రువుగా ప్రజల మనసు చూరగొన్న నాయకుడు శ్రీపాదరావు అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, వినోద్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, నాయిని ఓదెలు, బొమ్మక శైలజ, రాజేశ్, గుమ్మడి రవి, తాళ్లపెల్లి యుగందర్, ఎండీ యాకూబ్, ఫజల్‌బేక్, కోటేశ్వర్, నాయిని మల్లేశ్, ఎండీ ముస్తఫా, గట్ల రమేశ్, దాసరి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తికి అంతరాయం కలిగించొద్దు



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్యలను త్వరతగతిన పూర్తిచేసి.. బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని కార్పొరేట్ ఎస్టేట్ జీఎం వెంకటయ్య సూచించారు. శనివారం ఆర్జీ-1 అధికారులతో సమీక్ష సమావేశం స్థానిక జీఎం కార్యాలయంలో నిర్వహించారు. జీడీకే-11గని, జీడీకే-5 ఓసీపీకి సంబంధించిన భూసేకరణపై చర్చించారు. కోర్టు కేసులు, లోక్ అదాలత్‌కు సంబంధించిన సెటిల్‌మెంట్‌ల గురించి రైతులు, లాయర్లతో కలిసి చర్చించారు. ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్, అధికారులు రాంమోహన్, శ్రీనివాస్ ఉన్నారు.



చల్లదనం కోసం..

ఎండల నుంచి రక్షణ కల్పించేందుకు గ్రామాల్లోని వన నర్సరీలకు చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు. అంతేకాదు.. పశువులు, జంతువుల నుంచి కాపడేందుకూ వీటిని వినియోగిస్తున్నారు. వచ్చే హరితహారానికి అవసరమయ్యే మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన నిర్వాహకులు.. ఇలా చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు. సుల్తానాబాద్ మండలం అల్లీపూర్, మద్దికుంట నర్సరీల్లో చలువ పందిళ్లు నిర్మించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ధాన్యం కమీషన్ డబ్బులేవి?

- లెక్కలు చెప్పేంత వరకూ కొనుగోళ్లు వద్దు
- స్వశక్తి మహిళా సంఘాల డిమాండ్
- గన్నీ సంచులు వెనక్కి పంపించిన వైనం



వీఏవోను నిలదీస్తున్న మహిళలు

ధర్మారం(ధర్మపురి): గతంలో కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు కమీషన్ లెక్కలు చెప్పేంత వరకూ ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం నడపవద్దని స్వశక్తి సంఘం మహిళలు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్నీ బ్యాగులను వెనక్కి పంపించివేసి నిరసన తెలిపారు. ఈ సంఘటన నర్సింగపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. నర్సింగపూర్ గ్రామానికి సెర్ప్ ద్వారా 2000- 2013 వరకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహించారు. కానీ, మహిళలకు రావాల్సిన కమీషన్ వివరాలు చూపించలేదు. ఇందుకు గతంలో పనిచేసిన వీవోఏ కారణమని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న వీవోఏ ఆధ్వర్యంలో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇటీవల ఆ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, తమకు రావాల్సిన కమీషన్ వివరాలు వెల్లడించాలని, అప్పటివరకు కొనుగోలు కేంద్రం నిర్వహించరాదని స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు వీవోఏను ప్రశ్నించారు. ఇదే సమయంలో వ్యాన్‌లో గన్నీబ్యాగులు రాగా.. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు గన్నీ సంచులు అవసరం లేదని వెనక్కి పంపించారు. ఇప్పటికే ఈ గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో మరో కొనుగోలు కేంద్రం మంజూరైందని, తమకు తెలియకుండా కొనుగోళ్లు ఎలా ప్రారంభిస్తారని వీవోఏను నిలదీశారు. ఈ విషయమై సీఏ అనితను వివరణ అడుగగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు.

క్లుప్తంగా

పత్తిపాక మోహన్‌కు బిహువన్ అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న మోహన్

సిరిసిల్ల కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన బాల సాహిత్యకారుడు, నేషనల్ బుక్ ట్రస్టు ఉపసంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌ను మరో పురస్కారం వరించింది. బెంగళూర్‌లోని అస్సోం అసోసియేషన్ అస్సోం నూతన సంవత్సరం బిహు సందర్భంగా బిహువన్ అవార్డును శనివారం ప్రదానం చేసింది. అస్సోం, తెలంగాణ సాహిత్య స్నేహానికి గుర్తుగా పురస్కారం అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మణిదీప్‌దాస్, కార్యదర్శి బీభాష్ హాజరిక తెలిపారు. అస్సోం సంస్కృతికి చిహ్నమైన ఖడ్గమృగం చిహ్నంతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధి బిజత్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'మానేరు' విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్


విద్యార్థులతో మానేరు విద్యాసంస్థల చైర్మన్ అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులకు హైదరాబాద్ టాపర్స్ ఐఐటీవారు శనివారం మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 2023–24 విద్యాసంవత్సరంలో టాపర్స్ ఐఐటీలో తరగతుల వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి బంగారు, రజత, కాంస్య పతకాలతోపాటు సర్టిఫికెట్లు అందజేశారని మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఉమ్మడి జిల్లాలో ఐఐటీ తరహా విద్యా విధానానికి మానేరు విద్యాసంస్థలు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇది పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షల్లో విజయానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మానేరు' సామగ్రి చోరీ ఘటనపై కేసు

ముత్తారం(మంథని): మండలంలోని ఓడెడ్ మానేరు బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. 10 ఇనుప ప్లేట్లు, 2 స్టేజింగ్ క్రిబ్స్ ఎత్తుకెళ్లినట్లు బ్రిడ్జి నిర్మాణ ఇన్‌చార్జి సయ్యద్ బాబా శనివారం ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌పై కోడ్ ఉల్లంఘన కేసు

మంథని: అనుమతి లేకుండా మంథనిలో నిరసన దీక్ష చేపట్టిన పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులపై పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం జెడ్పీ చైర్మన్ నివాసానికి వెళ్లి, నోటీసులు అందించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి వ్యవహరించాలని, ఎవరు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు

- జగిత్యాల జిల్లాలోని పలుచోట్ల నగదు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలపై పట్టణ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. కాసారపు రాజయ్య వద్ద రూ.56.35 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రూ.4 లక్షలు, లవంగ రాజేందర్ వద్ద రూ.70 వేలు, రూ.1.58 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, రమేశ్ వద్ద 28 ప్రామిసరీ నోట్లు, రెండు ఖాళీ చెక్కులు, అరవింద్ వద్ద 29 ఖాళీ చెక్కులు, రూ.2.50 లక్షల విలువైన మార్టిగేషన్ పేపర్లు, కడెం వెంకవ్వ వద్ద రూ.21.43 లక్షల విలువైన 56 ప్రామిసరీ నోట్లు, రూ.85 వేలు పట్టుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు నరేశ్‌కుమార్, మన్మథరావు, ఏఎస్సై వేణురావు, సిబ్బంది పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతె, టీఆర్‌నగర్ గ్రామాల్లోని నలుగురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు. టీఆర్‌నగర్‌కు చెందిన పెద్ద సారయ్య ఇంట్లో రూ.1.19 లక్షలు, 129 ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గోధూర్, సత్తక్కపల్లి గ్రామాల్లో శనివారం ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. గోధూర్‌లో బండి పురుషోత్తం ఇంట్లో రూ.8.33 లక్షల విలువైన 17 ప్రామిసరీ నోట్లు, రూ.3 వేల విలువైన బ్లాంక్ చెక్, 23 చిన్న నోటు పుస్తకాలు, 2 మీడియం నోటు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. సత్తక్కపల్లిలో ఆరెళ్ల రాజగౌడ్ ఇంట్లో రూ.36.45 లక్షల విలువైన 18 ప్రామిసరీ నోట్లు, చిన్న బుక్స్ 18, మీడియం బుక్ 1, లాంగ్‌నోట్ బుక్ 1, రూ.1.69 లక్షలు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి, ఆ ఇదరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మెట్‌పల్లిలో పోలీసులతో వడ్డీ వ్యాపారి వాగ్వాదం

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల, అల్లీపూర్ గ్రామాలకు చెందిన వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అల్లీపూర్‌లోని రాజు ఇంట్లో రూ.1.80 లక్షలు, ఇటిక్యాలలోని శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో రూ.18 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు లభ్యమైనట్లు తెలిపారు.

ధర్మపురి: స్థానిక 9 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లలో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.6.23 లక్షలు, 65 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని, విచారణ చేపడుతున్నామని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వడ్డీ వ్యాపారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రేగుంట, మొగిలిపేట గ్రామాలకు చెందిన పలువురి ఇళ్లలో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు చేశామని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. అయితే, పోలీసులకు నగదు, ఎలాంటి అప్పు పత్రాలు లభించలేదని తెలిసింది.

కోరుట్ల: కోరుట్లకు చెందిన 12 మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అరిసెల్లి రాజేశం ఇంట్లో రూ.1.28 లక్షలు, రూ.69 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేశ్‌బాబు, ఎస్సై కిరణ్ తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది ర్యాగల్ల వెలయేశ్వర్, వేముగంటి భూమేశ్వర్, ధ్యావనపల్లి రాజారాం ఇళ్లల్లో రూ.5 లక్షలు, రూ.87 లక్షల విలువైన ప్రామిసరీ నోట్లు, 26 చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే, కట్కం రమేశ్ ఇంట్లో సోదాలకు వెళ్లగా అతను పోలీసులను అడ్డుకొని, వాగ్వాదానికి దిగాడు. ఒక దశలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అయినప్పటికీ పోలీసులు రమేశ్ ఇంట్లోకి వెళ్లి, తనిఖీలు చేపట్టారు. బంగారం తాకట్టు పెట్టుకొని, అప్పులు ఇచ్చే ఇతను గతంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ సమయంలో అతని వద్ద నుంచి పెద్ద ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జరిపిన సోదాల్లో కూడా భారీగా బంగారం పట్టుబడినట్లు తెలిసింది. ఈ తనిఖీలను ఎస్‌బీ డీఎస్పీ రవీందర్ పర్యవేక్షించారు.

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండ, శెకెల్ల గ్రామాలకు చెందిన వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. అప్పు పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నామని, శెకెల్లకు చెందిన బంక వెంకటేశం, వెల్గొండకు చెందిన వెంకటరాజంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.


జగిత్యాల: తనిఖీ చేస్తున్న సీఐ వేణుగోపాల్


ధర్మపురిలో నగదు, ప్రామిసరీ నోట్లు చూపుతున్న సీఐ రాంనర్సింహారెడ్డి


సత్తక్కపల్లిలో ఎస్సై అనిల్..


కోరుట్లలో సోదాలు చేస్తున్న పోలీసులు

అనుమతులు మీరి.. రోడ్డును ఆనుకొని

- కరీంనగర్ నగరంలోని కాపువాడలో వివాదాస్పదంగా ఇంటి నిర్మాణం


కాపువాడలో వివాదాస్పదంగా మారిన ఇంటి నిర్మాణం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కాపువాడలో అనుమతులు మీరి, రోడ్డును ఆనుకొని చేపడుతున్న ఇంటి నిర్మాణం వివాదాస్పదమవుతోంది. పాత ఇంటిని తొలగించి కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్నప్పటికీ, నగరపాలకసంస్థ అనుమతి ప్రకారం కాకుండా నిర్మాణం రోడ్డుపైకి వస్తుండడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలకసంస్థ 6వ డివిజన్ పరిధిలోని మారుతినగర్ చౌరస్తా నుంచి శివాలయం చౌరస్తా వరకు వెళ్లే ఈ రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటుంది. నగరంలోనే పురాతనకాలనీ అయిన ఈ కాపువాడలో పాత ఇండ్లు తొలగించి నూతన గృహాల నిర్మాణం చేపట్టడం ఇటీవల పెరిగిపోయింది. అయితే కొత్త ఇండ్ల నిర్మాణాల సమయంలో నిబంధనలు పాటించడంతో ఈ రోడ్డు మున్సిపల్ నిబంధనల ప్రకారం 30 ఫీట్ల వెడల్పుగా మారింది. కానీ, తాజాగా చేపట్టిన ఓ ఇంటి నిర్మాణం రోడ్డు వైపు ఎక్కువగా రావడంతో, రోడ్డు పరిధి తగ్గే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ విషయాన్ని స్థానికులు నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బల్దియా అనుమతి మేరకు నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు.

2 కిలోల గంజాయి పట్టివేత


అరెస్టు చూపుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

- ఐదుగురు విక్రేతల అరెస్టు
- వివరాలు వెల్లడించిన వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: 2 కిలోల గంజాయి పట్టుకొని, ఐదుగురు విక్రేతలను అరెస్టు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం సంబంధిత వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా అల్లూరి సీతారాంనగర్‌కు చెందిన పరిగిపండ్ల అన్వేశ్ అలియాస్ బన్నీ ప్రస్తుతం వేములవాడ పట్టణంలోని శాస్త్రీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతనితోపాటు పట్టణంలోని సుభాష్‌నగర్‌కి చెందిన మద్రిపల్లి సురేశ్ శుక్రవారం సాయంత్రం వేములవాడ రూరల్ మండలంలోని నాగాయపల్లి రైతు వేదిక వెనకాల గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై మారుతి తన సిబ్బందితో వెళ్లి, వారిని పట్టుకున్నారు. 1.270 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులు వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో ఐస్‌క్రీం బండి నడిపే శ్యాం దివాకర్(యూపీ), కుమ్మరి మల్లికార్జున్(వేములవాడ), కట్కూరి భాను(కామారెడ్డి)ల వద్ద గంజాయి కొనుగోలు చేశారు. దాన్ని విక్రయించగా వచ్చే డబ్బులతో జల్సాలు చేయాలనుకున్నారు. గంజాయికి అలవాటు పడిన యువతకు అమ్మేవారు. శ్యాం దివాకర్, మల్లికార్జున్, భానులను వేములవాడ పట్టణంలోని అయ్యప్ప గుడి సమీపంలో పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి 620 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. మొత్తం ఐదుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుళ్లు రాజశేఖర్, తిరుపతి, శంకర్, గోపాల్, సతీశ్‌లకు రివార్డులు అందజేసి, అభినందించారు. సమావేశంలో రూరల్, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, టౌన్ ఎస్సై అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు చైతన్యమే లక్ష్యం

- పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం
- ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లతో ఒప్పందం

కరీంనగర్ లోక్‌సభ పరిధిలో..

పెట్రోల్ బంకులు	: 93
రైల్వేస్టేషన్లు	: 2
రోజువారీ ప్రయాణికులు	: 5,000–8,000
మొత్తం పోస్టాఫీసులు	: 523
ఖాతాదారులు	: 4,23,450మంది



కరీంనగర్ అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటర్ల నిర్ణయమే అంతిమం. దేశ భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ఓటరు చైతన్యమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. గత సార్వత్రిక పోరులో కరీంనగర్ జిల్లాలో నమోదైన ఓటింగ్ 65.57 శాతం మాత్రమే. ఈసారి పోలింగ్ శాతం మెరుగయ్యేలా సీఈసీ కొత్త పంథా అనుసరిస్తోంది. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, శాఖలను భాగస్వామ్యం చేయాలని తాజాగా నిర్ణయించింది. ఇందులో భాగంగా పోస్టల్, రైల్వే, పెట్రోలియం మంత్రిత్వ శాఖకు చెందిన ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఒప్పందం ప్రకారం..

- ఈసీతో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం.. సంబంధిత కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తమ పరిధిలోని ఖాతాదారులు, ప్రజలకు అత్యంత చేరువగా ఓటు ప్రాధాన్యంపై ప్రచారం చేస్తాయి.
- కేంద్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థల వెబ్‌సైట్‌లలో ఓటరు చైతన్య కార్యక్రమాలను ప్రముఖంగా ప్రదర్శిస్తారు. ఎన్నికల ప్రక్రియపై లోతైన అవగాహన కోసం యూజర్లకు అవకాశం కల్పిస్తారు.
- గోడపత్రాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఆయా సంస్థల కార్యాలయాలు, భవనాలు, ఇతర ముఖ్య ప్రదేశాల్లో ప్రదర్శిస్తారు. ఎక్కువ మంది సందర్శించే ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.
- పోస్టాఫీసుల వేదికగా ఓటు చైతన్య చర్చలు నిర్వహిస్తారు. ఉద్యోగులు, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తారు. ఇప్పటికే అమలవుతున్న స్వీప్ వంటి కార్యక్రమాలపై సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇస్తారు.
- ఆయా సంస్థల సోషల్ మీడియా, కస్టమర్ ఔట్ రీచ్ వేదికల ద్వారా ప్రచారం చేస్తారు.
- కరీంనగర్ డివిజన్‌లోని ప్రధాన పోస్టాఫీసుల పరిధిలో 70 ఉప, 453 గ్రామీణ తపాలా కార్యాలయాలున్నాయి. వీటికి ఇప్పటికే ఎన్నికల ప్రచార సామగ్రి చేరినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వాటిని ప్రచారానికి వినియోగించనున్నారు.

స్వీప్ కార్యక్రమం..

పోలింగ్ రోజు ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా చైతన్యం కల్పించాలన్న ఉద్దేశంతో సీఈసీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదే స్వీప్(సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం. ఈ విభాగం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. లక్షిత ఓటర్లు గల ప్రాంతాలు, జన బాహుళ్య కూడళ్లలో మొబైల్ వాహనాల ద్వారా ఓటు విలువ, పోలింగ్ సమాచారం, ఇతర వివరాలను ప్రచారం చేస్తున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వామ్యం చేయడం వల్ల పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

కొండగట్టు ఆలయ అధికారులపై చర్యలకు ఆదేశాలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన పలు దుకాణాల వేలం డబ్బులను ఆలయ అధికారి శ్రీనివాసాచారి సొంతానికి వాడుకున్నారని అప్పటి ఈవో వెంకటేశ్ ఆయనను సస్పెండ్ చేశారు. ఆ వెంటనే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.జ్యోతి ఆలయానికి వచ్చి, రికార్డులను పరిశీలించారు. వాటిని హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఆలయ ఈవోను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కాగా, టెండర్లు నిర్వహించాక లావాదేవీలను సరిచూసుకునే క్రమంలో నిర్లక్ష్యం చేసిన మిగతా అధికారులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవోకు 23.03.2024న ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం శనివారం తెలియడంతో ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా త్వరలోనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని 'సాక్షి'కి తెలిపారు.


కొండగట్టు అంజన్న ఆలయం

నకిలీ నియామక పత్రాల కలకలం

- పదుల సంఖ్యలో బాధితుల గుర్తింపు
- హైదరాబాద్‌కు పరారైన నిందితుడు
- పోలీసుల గాలింపు

కోరుట్ల: కథలాపూర్ మండలంలోని సిరికొండకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకొని, నకిలీ నియామక పత్రాలు ఇవ్వడం కలకలం రేపుతోంది. ఇలా మోసపోయినవారు పదుల సంఖ్యలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు హైదరాబాద్‌కు పరారైనట్లు సమాచారం. శనివారం కొంతమంది బాధితులు సిరికొండలోని అతని ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని గతంలోనూ కొంత మంది వద్ద డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

రూ.లక్ష వరకు వసూలు..

ఓ యువతి శుక్రవారం నకిలీ నియామక పత్రంతో కోరుట్ల పట్టణంలోని బస్తీ దవాఖానాకు వెళ్లడం.. తనను ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేర్చుకోవాలని కోరగా వైద్య సిబ్బంది ఉన్నతాధికారులు, పోలీసులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు నకిలీ నియామక పత్రాలు తయారు చేసి, ఇస్తున్న వ్యక్తి వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగాల పేరిట కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి పరిసర ప్రాంతాల్లో అతను కొంతమంది యువత వద్ద రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసి, నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిసింది. నిందితుని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.


నకిలీ నియామక పత్రం


సంతకం, రిజిస్ట్రేషన్, రిఫరెన్స్ నంబర్లు..

కోరుట్ల బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అపాయింట్ చేస్తూ జారీ చేసిన నకిలీ నియామక పత్రం పకడ్బందీగా ఉండటం చర్చనీయంగా మారింది. డీఎంహెచ్‌వో సంతకంతోపాటు రిజిస్ట్రేషన్, రిఫరెన్స్ నంబర్లు ఉండటం గమనార్హం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్త పోస్టులు ఇచ్చే అవకాశం లేకపోవడం, బస్తీ దవాఖానాలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు లేకపోవడంతో వైద్య సిబ్బందికి అనుమానం వచ్చింది. తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిజాలు నిగ్గు తేల్చడానికి పోలీసు అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మృతుడి భార్య 9 నెలల గర్భిణి..
- ఆమెకు, కుమారుడికి తప్పిన ప్రాణాపాయం
- విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో ఘటన

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. అతని భార్య గర్భిణి. ఆమెకు, కుమారుడికి ప్రాణాపాయం తప్పింది. ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూరు గ్రామానికి చెందిన పందిరి మహేశ్(35)కు భార్య పూజిత, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం 9 నెలల గర్భిణి. మహేశ్ అన్న కుమారుడికి శుక్రవారం సాయంత్రం గుండెనొప్పి రావడంతో భార్య, కొడుకుతో కలిసి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి కారులో తీసుకెళ్లాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లి వద్దకు రాగానే మహేశ్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య, కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


మహేశ్ (ఫైల్)

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..

- విలేకరి దుర్మరణం

రామగుండం: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయిన ఓ విలేకరి అదే బస్సు టైరు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలోని కుర్మపల్లికి చెందిన సొప్పరి ఓదెలు అలియాస్ ఉదయ్(40) కెమెరామెన్‌గా, ఓ చానల్‌కు పాలకుర్తి మండల విలేకరిగా పని చేస్తున్నాడు. శనివారం బైక్‌పై బసంత్‌నగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్నాడు. మల్యాలపల్లి బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డాడు. బస్సు వెనక టైరు ఆయన తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి భార్య స్వరూప అంగన్‌వాడీ టీచర్. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఓదెలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రామగుండం ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఓదెలు (ఫైల్)